


# రామయ్యా దుర్భర జీవితము

కోమాండూరి వేంకటాచార్యులు గారు

మావూరిలో రామయ్యను యెరగనివాళ్లంటూ లేరు. ఎందుచేతని అడుగుతా రేమో చెప్తాను వినండి: మొట్టమొదటి కారణం- అతడు వయస్సుమీరిన వాడవటం; రెండవది-పిల్లాజెల్లలతోటి గుట్టుమట్టుగా సంసారం చేసుకోనటం. ఈ రోజులలో సామాన్యగృహస్థు సంసారము గడపట మనేది బ్రహ్మగర్భం యెక్కటంతో సమాన మంటారు.

సాయంకాలము 6 గంట లయింది. రామయ్య ఆఫీసు వదలి ఇంటికి వచ్చాడు. రావటంతోటే పిల్లలందరూ తనచుట్టూ చేరి వెఱ్ఱి సంతోషముతోటి ఆడడము మొదలుపెట్టారు. రామయ్యకు దీని అర్థ మేమీ తెలియక దిగ్భ్రమతో పిల్లలకేసి తేరిపార చూసాడు. ఇదివర కెన్నడూ లేనిసంతోషము ఈరోజున పిల్లల్లో ఆవిర్భూత మైనందుకు రామయ్యకు ఆశ్చర్యముగా వుంది. ఈసంతోష మెందుకో పిల్లల్ని అడుగుదా మనుకుంటుండగానే ఏడేళ్ల వయసుగల తనకూతురు దగ్గరకు వచ్చి "నాన్నా! రత్నమ్మ పిన్నొచ్చింది" అంది. రత్నమ్మ రామయ్యకు మరద లవుతుంది.

రామయ్య ముఖము చిట్లించుకుంటూ "అల్లానా" అన్నాడు. ఇంతట్లోకే ఇతని భార్య సీతమ్మ—పక్కా తెలివితేటలుగలది— చిరునవ్వు నవ్వుకుంటూ వచ్చి భర్తతో "ఇటు చూడండి, రత్నమ్మ వచ్చిం దండోయి" అని అంది. ఒక్క నిట్టూర్పు విడిచి "బాగానే వుం"దని అన్నాడు రామయ్య. ఈమారు నవ్వటానికి ప్రయత్నించాడు కాని మబ్బురోజున వెలుతురులాగున నవ్వు మాయమయింది. "ఇవాళ మీరు చాలా ఆలస్యంగా వచ్చారేం? వగరుస్తున్నారు కూడాను" అని ప్రేమ వుట్టిపడుతూన్నట్టు జాలి గదుర ప్రశ్నించింది సీతమ్మ. "మరేమీ లేదు. ఇవాళ ఆఫీసులో పని యెక్కువగా వుంది" అంటూ తాను తొడుగుకున్న వదులు కోటును వంటినుండి విప్పాడు.

మరదలియొక్క ఆగమనానికి సంతోష పడుట ఒకలెక్కలోనిది కాదు. కాని రామయ్యకు అప్పటిస్థితి గతులను పట్టి రవంత కష్టం కలిగినమాట మాత్రం వాస్తవము. రామయ్య మాప్రారి యూనియను ఆఫీసులో

గుమాస్తా. ఇతని కిచ్చేజీతం బహుస్వల్పము. ఆజీతం తెచ్చుకుని 15 రోజు లయిందో లేదో అప్పుడే ఖజానా నిండుకుంది. జీతం పేరుచెప్పి ఏమి సంపాదిస్తేనేం రెండు పెద్దపద్దులు మింగేస్తున్నాయి. అందులో ఒకటి ఇంటద్దె; రెండవది కిరాణాకొట్టులో కాతా. ఇక ప్రతినెలా మూడవరోజుకి గృహాయజమాని ఇంటద్దికి గడపమీద కూర్చుంటాడు. మనిషిదగ్గర ఖచిత మెక్కువ. అంటువ్యాధి ఎల్లాగయితే పట్టుకుని వదలదో అల్లా పట్టుకుని అద్దె యిచ్చేదాకా వదలడు. ఇందువిషయమై పాపము రామయ్యా అప్రయత్నంగా కంగారు పడేవాడు. ఇంక కోమటాయన ప్రతాపం చెప్పనే అక్కరలేదు.

ఈసంగతిల్లా వుండగా పాల కయ్యే డబ్బుకి మితి లేదు. పాలని పైకి పేరేకాని అవి తెలుపురంగులో వుండే నీళ్లు. ఈఖర్చులంతా యెందుకంటే పిల్లలు పాలు లేకుండా వుండలేరు. ఇవి గాక పిల్లలకు బడిజీతాలంటే, సంతఖర్చు లంటే; ఇటువంటి వెన్నో వున్నాయి. ఈలాగ ప్రతినెలా రామయ్యా పాతబాకీలు తీర్చటమూ, కావలసిన సరుకులకు కొత్తబాకీలు చెయ్యటమూ అలవాటైపోయింది.

వీటి సన్నిటిని బట్టి రామయ్యాకు మనస్సులో మరదలు వచ్చిం దని ఉల్లాస మేమీ లేకపోయింది. 'మళ్లీ అదనపుఖర్చులు ఈమెరాకవల్ల కలుగుతున్నయిరా భగవంతుడా' అని గుండె గుభిల్లుమంది. ఆయన హృదయంలో వుండే ఉత్సాహమంతా పోయి ఒక్క నిట్టూర్పు వదిలాడు. సీతమ్మ దాన్ని కని పెట్టి చిటచిట లాడింది. ఇటువంటి ఆత్మవిచారణసమయంలో, అతిథ్యమునకును, ఉత్సాహహీనమైన దారిద్ర్యమునకును మనస్సునందు జరుగుచున్న శాంతిసమరసమయమందు ఘనత వహించిన మరదలుగారు గది ప్రవేశించి మందస్మితముతో బావగారిని కుశలప్రశ్న వేసింది. దానికి రామయ్యా లేనిసంతోషము తెచ్చిపెట్టుకుని ఆమెను ఆహ్వానించాడు:

"ఓహో; రత్తమ్మమరదలుగారా? ఎంత దయ వచ్చింది. పిల్లా జెల్లా కులాసాగా వున్నారుకదా? వెంకటపతి (భర్త) నిన్ను ఒక క్షణమైనా యెడబాసి వుండలేదు కదా. ఒక్కదానవు యెల్లా రాగలిగావు?"

వయస్సులో వుందేమో రత్తమ్మ; ఈ మాటలకు కొంచెం సిగ్గుపడింది. సీతమ్మ కనుబొమలు ముడిచింది. ఆయనమాటలు మన్మథుని బాణా లనిపించాయి. రామయ్యా హాస్యం చెయ్యటంలో గట్టివాడని ఇదివరలోనే పేరు పొందాడు. రత్తమ్మ తన కొడుకు వళ్లు బాగుచేసుకుందా మని వచ్చా నని చెప్పింది. ఈముక్కలు వినే వినడంతోటే రామయ్యాకు నడుము విరిగినట్టయింది. ఇదివరదాకా ఆమె కులాసాకి వచ్చి ఒకటి రెండు రోజు లుండి పోతుం దనుకున్నాడు. ఇప్పుడావిడ అధమపక్షం రెండునెల లయినా వుండాలి. ఈఖర్చంతా తననెత్తిమీద విరుచుకు పడుతుందనే విచారంలో మునిగిపోయాడు. ఇట్టి వ్యాకులతతో చేరిన ఆలోచనలు అలలవలె తొందరగా వచ్చిపడ్డాయి. కళ్లల్లోనున్న కాంతి తరిగింది. ముఖము నల్లపడింది.

రామయ్యగారి సాహసము పరీక్షించటానికి వచ్చిన రోజుల్లా కనపడ్డాయి.

"పిల్లవానికి జ్వరము వస్తోందిట. వెంకటపతికి శెలవు దొరికింది కాదు. అతడు మందుకయ్యే ఖర్చు పెట్టుకుంటాడు గాని శ్రద్ధతీసుకునేవాళ్లెవరూ లేరని మీావద్దకు రత్తమ్మను పంపాడు" అని అంది సీతమ్మ.

"ఓహో, ఇక్కడనుంచి రెంపసంసారాలని పోషించాలి కాబోలు? నేనే వెయ్యిళ్ల పూజారిని" అని నవ్వాడు రామయ్య.

"మీాయిష్టము వచ్చినట్టు తిరగండి, యెవరు వద్దన్నారు? మనుష్యులకు మంచీ మర్యాదా వుండాలి" అని కోపముతో ఒక్క ఉరుము ఉరిమింది సీతమ్మ. ఈపరిహాసాలకి నవ్వుతూ నిలబడింది రత్తమ్మ.

"ముందుగానే ఖర్చుకి వెంకటపతి రు. 50 రత్తితో పంపాడు. తర్వాత మీా రేమయినా చేసుకోండి" అని విసవిస లాడుతూ రూపాయిలు చేతిలో పోసింది సీతమ్మ. దానికి రామయ్య భార్యకేసి కృతజ్ఞతాపూర్వకమైన చూపుచూసాడు. కృతజ్ఞ తెందుకంటారేమో? ఆమర్నాడే ఒక అర్జెంటుబాకీ తీర్చాలిసి వుంది. తలవనితలంపుగా డబ్బు చేతిలో బడినందుకు రామయ్యకు కొంచెము ఒడుదొడుకు శాంతించింది.

భోజనా లయింతర్వాత అతిథులకు పడుకుంటానికి చోటు చూపెట్టేటప్పుడు వచ్చింది గొప్పచిక్కు. గొప్పగొప్పవాళ్లంతా సౌధాల్లోనూ, హంసతూలికాతల్పాల్లోనూ గడుపుతారు రోజులు. ఇందుకు వాళ్లు ఏనాడో పెట్టిపుట్టారు. రామయ్యలాంటి కష్టజీవి జీవనం గాలి వెలుతురు లేని ఇరుకైన అద్దెకొంపల్లో చెయ్యక ఇంకెక్కడ చేస్తారు చెప్పండి! వాళ్లు కష్టపడాలి. కష్టాలన్నీ బీదవాళ్లకి కాకపోతే భాగ్యవంతుల కుంటాయా బాబు! ఈ ప్రకారంగానే రామయ్య మనస్సునకు సమాధానం చేసుకున్నాడు. భర్తలు ఎంతసేపూ తీసుకొచ్చి పడేసారుకారనే గోలగాని, ఇంట్లో ఇదవుంది అదిలే దనే వివకుత మన ఆడవాళ్లకు లేదు. ఇరుకుకొంప డబ్బుకు లోభించి తీసుకొన్నందుకు సీతమ్మ భర్తను అంపపుకోత కోసిందంటే నమ్మండి.

కష్ట మనుకున్నదాని కల్లా ఏదో ఒక దారి ఉండనే వుంది. పిల్లలగుంపు నంతటిని ఒక గదిలోకి తోసారు. వాళ్లు నిద్రల్లోకూడా మిఠాయికోసము కలవరించటం మొదలు పెట్టారు. రామయ్య పడుకగది భార్యా మరదళ్లాక్రమించారు. రామయ్య బిఛాణా సామాను కొట్టుదగ్గరకు మార్చారు. మంచముమీాద కూర్చుని రామయ్య ఒక్కనిట్టూర్పు వదలాడు. ఈదరిదాపులేని ప్రపంచములో తన నిజస్నేహితుడై నిలిచియున్న చుట్టను గొప్ప ఆసక్తితో కాల్చటము మొదలుపెట్టాడు. దోమలు, చిమ్మటలు పెద్దధ్వనితో ఆటపాటలకు ప్రారంభించాయి. ఆనిద్ర లేనికళ్లకి మధ్య మధ్య పెద్దపెద్ద మొత్తములతో అదనపు ఖర్చులు కళ్లకి కట్టడము మొదలుపెట్టాయి.